సాక్షి
బాపట్ల
ఆదివారం । 16 । జూన్ । 2024



వైభవంగా దివ్య పడి పూజ

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న అయ్యప్పస్వామి దేవస్థానంలో వైభవంగా పడిపూజ మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు.



మల్లేశ్వరస్వామి కల్యాణం

ఫిరంగిపురం: గొల్లపాలెంలో వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం, స్వామివారి కల్యాణం శనివారం నిర్వహించారు.

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి డొంక వద్ద గల శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి ఆలయ తిరునాళ్ల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వరించిన వరుణుడు

- జిల్లాలో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు
- ఇప్పటికే మొదలైన వర్షాలు
- జిల్లావ్యాప్తంగా 1,41,916 హెక్టార్లలో వివిధ పంటల సాగు
- అత్యధికంగా 1,03,790 హెక్టార్లలో వరి సాగు
- సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

తొలకరి పలకరింపులతో భూమాత పులకరించింది. చినుకుల సవ్వడితో పొలాలన్నీ పదునెక్కాయి. రైతులు కొత్త ఉత్సాహంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. దుక్కులు దున్ని పొలాల్ని సిద్ధం చేస్తున్నారు. నాగేటి సాళ్లతో నేలతల్లి వింత సోయగాన్ని సంతరించుకుంది. వెలలేని మాగాణి భూముల్లో ధాన్యపు సిరులు పండించడానికి అన్నదాతలు శ్రమిస్తున్నారు. 'వరి'ంచిన వరుణుడితో ఈ ఏడాది కూడా లాభాల పంట పండుతుందని ఆశిస్తున్నారు. ఎన్నికలకు ముందే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసింది. సాగుకు ముందే విత్తనాలు అందుబాటులో ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దుక్కులు దున్ని సిద్ధం చేసిన పొలం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: గత పది రోజుల నుంచి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మరోవైపు నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముంది. జూన్ మొత్తం జిల్లాలో సగటున 71.1 మి.మీ. వర్షం పడాల్సి ఉంది. 15వ తేదీ నాటికి 26 మి.మీ. గానూ ఇప్పటికే 47.2 మి.మీ.కురిసింది. ఇది కురవాల్సిన దానికంటే 84.38 శాతం అధికం. ఈ ఏడాది కూడా ముందస్తు వర్షాలు కురిసే అవకాశముండడంతో జిల్లాలో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే భూముల్ని దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 1,41,916 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయని వ్యవసాయశాఖ కూడా అంచనా వేసింది.

అత్యధికంగా వరి సాగు

జిల్లాలో కృష్ణా వెస్టన్ డెల్టా కింద అత్యధికంగా ఖరీఫ్ సీజన్‌లో 2,59,475 ఎకరాల్లో (1,03,790 హెక్టార్లు) వరి పంట సాగు కానుంది. ప్రధానంగా వేమూరు, రేపల్లె, బాపట్ల ,చీరాల, పర్చూరు ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా వేస్తారు. వేమూరు ప్రాంతంలో జూన్ నుంచే సాగు కానుండగా, చివరి ఆయకట్టు(టెయిలెండ్) ప్రాంతాలైన రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో జులై మొదలు ఆగస్టు వరకూ సాగవుతుంది.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమికి సారం

ఖరీఫ్‌లో వరి సాగుకు కొంత సమయం ఉండడంతో తాజాగా కురిసిన వర్షాలతో రైతులు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువుల సాగు చేపట్టారు. జీలుగ, పిల్లిపెసర పంటల సాగుతో భూమి కూడా సారవంతమవుతుంది. ప్రభుత్వం కూడా ఏటా 50 శాతం సబ్సిడీతో విత్తనాలను అందిస్తోంది.

- జిల్లాకు 1000 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించగా ఇప్పటికే 802.50 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకూ రైతులకు 313.20 క్వింటాళ్లు పంపిణీ చేశారు.
- 1000 క్వింటాళ్ల జనుము విత్తనాలకు గాను 835.20 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో 262.30 క్వింటాళ్లను రైతులకు అందించారు.
- 800 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలకు గానూ 760.08 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో రైతులకు 295. 28 క్వింటాళ్లు అందజేశారు.
- జిల్లాకు అదనంగా 266 క్వింటాళ్ల జనుము, 779 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తన కేటాయింపుల కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

వరి విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో 2వేల క్వింటాళ్ల వరి విత్తనాల్ని రైతులకు ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 25 మండలాల పరిధిలో బీపీటీ 5204 రకం 1,035 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 310 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 655 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఇవికాకుండా 150 క్వింటాళ్ల మినుము, 50 క్వింటాళ్ల పెసర, 50 క్వింటాళ్ల కంది విత్తనాల్ని కూడా సిద్ధం చేస్తున్నారు. మరో వైపు వరి సాగు సమయానికి రాష్ట్రవ్యాప్తంగా విత్తన ఉత్పత్తి కేంద్రాల నుంచి విత్తనాలను రైతులకు అందించనున్నారు. దీంతో పాటు వివిధ కంపెనీలను కూడా అందుబాటులోకి తేనున్నారు.



పచ్చిరొట్ట పైరు సాగు

జిల్లాలో పంటల సాగు ఇలా..

పంట రకం	విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	1,03,790
పత్తి	4205
మినుము	2275
కంది	1960
వేరుశనగ	926
మొక్కజొన్న	803
కూరగాయలు, సజ్జ, రాగి, సామ, అరికలు	38,126

వరితో పాటు ఇతర పంటల సాగు

జిల్లాలో వరితోపాటు ఖరీఫ్‌లో పత్తి, మినుము, వేరుశనగ, కంది, మొక్కజొన్న, పూలు, కూరగాయలు, కొర్ర, సజ్జ తదితర రకాల పంటలు 95,315 ఎకరాల విస్తీర్ణంలో సాగు కానున్నాయి. జూన్ నుంచే రేపల్లె, వేమూరు ప్రాంతాల్లోని లంక గ్రామాలతోపాటు బాపట్ల, పర్చూరు , అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయి. మొత్తంగా ముందస్తు వర్షాల నేపథ్యంలో అన్నదాతలు ఉత్సాహంగా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు



ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. జిల్లాలో వరి సాగు అధికంగా ఉంటుంది. దీంతో ఈ పంటకు అనువుగా రైతులకు 2,800 క్వింటాళ్ల జీలుగ, జనుము, పిల్లిపెసర (పచ్చిరొట్ట) విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నాం. అవసరమైతే మరిన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. వీటితో పాటు 2 వేల క్వింటాళ్ల వరి విత్తనాలతోపాటు మినుము, పెసర, కంది విత్తనాలను సైతం రైతులకు అందజేయనున్నాం. విత్తనాల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

–వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

స్టూడెంట్ కిట్లను సకాలంలో అందించాలి

- రాష్ట్ర ఎంఐఎస్ కోఆర్డినేటర్ హైమారావ్
- పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు సకాలంలో చేర్చాలి



పుస్తకాల పంపిణీలో హైమారావు

చినగంజాం: ప్రభుత్వం పాఠశాలకు స్టూడెంట్ కిట్లను నేరుగా పంపించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులదేనని రాష్ట్ర ఎంఐఎస్ కోఆర్డినేటర్ హైమారావ్ స్పష్టం చేశారు. మండలంలోని చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలకు స్టూడెంట్ కిట్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల పంపిణీలో అవాంతరాలు లేకుండా చూడాలని, కిట్లను నేరుగా పాఠశాలలకు చేర్పించాలని అధికారులకు సూచించారు. సకాలంలో విద్యార్థులకు పంపిణీ చేసే విధంగా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లో తప్పొప్పుల్ని తమ దృష్టికి తెస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన స్వయంగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సీఎంవో వెంకటేశ్వర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు బి. అజయ్‌బాబు, ఎన్. కోటేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి. రత్నకుమారి, ఉపాధ్యాయులు ఎస్. నరసింహారావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మెడికల్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభ పోస్టర్లు శనివారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 27న గుంటూరు జీజీహెచ్‌లోని యూనియన్ కార్యాలయంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ జరగనుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డె బాలయ్య, నేతలు నాగరాజు, వెంకటేశ్వరరావు, శంకరరావు, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

వెస్ట్ గోదావరిపై గుంటూరు విజయం



మూలపాడు(ఇబ్రహీంపట్నం): వెస్ట్ గోదావరి జట్టుపై గుంటూరు జిల్లా జట్టు 132 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసుకుంది. మూలపాడు గ్రామంలోని ఏసీఏ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ జోన్ అండర్ 23 ఇంటర్ డిస్ట్రిక్ట్ వన్‌డే మెన్ క్రికెట్ టోర్నీలో ఐదో రోజు శనివారం వెస్ట్ గోదావరి, గుంటూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టు క్రీడాకారులు చందు 79 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109, మహ్మద్ సిద్ధిక్ 48 బంతుల్లో 7 ఫోర్లుతో 60 పరుగులు చేసి జట్టు భారీస్కోర్‌కు తోడ్పడ్డారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్ట్ గోదావరి జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 225 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. జట్టులో స్వామినాయుడు 64, కె.ఎస్.ఎన్.రాజు 87 పరుగులు చేసి ఫర్వాలేదనిపించారు. గుంటూరు జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది.


'నేను బడికి పోతా' కమిటీల ఏర్పాటు

డీఈఓ వెంకటేశ్వర్లు



నరసరావుపేట ఈస్ట్: పాఠశాలకు రాని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమం విజయవంతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి జులై 12వ తేదీ వరకు బడి బయట విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. మండల స్థాయి కమిటీలో ఎంపీడీఓ చైర్మన్‌గా, మండల విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. గ్రామ స్థాయి కమిటీకి చైర్మన్‌గా పేరెంట్స్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గ్రామ/మండల స్థాయిలో ఎన్యూమరేటర్లుగా విలేజ్ వలంటీర్లు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీ, ఐఈఆర్పీ, పీటీఐ, కేజీబీవీలలోని సీఆర్‌టీ, అంగన్‌వాడీ కార్యకర్తలు వీరందరితో బృందాలుగా ఏర్పాటు చేసి బడికి రాని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి కమిటీలను ఏర్పాటు చేసి 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు పాఠశాలలో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, అన్ని యాజమాన్యాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సాగర్ నీటి మట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 810.70 అడుగుల వద్ద ఉంది.

సమష్టి కృషితోనే సమర్థంగా ఎన్నికల నిర్వహణ



ఎస్పీని సన్మానిస్తున్న సిబ్బంది



ఎలక్షన్ సెల్ అధికారి శ్రీనివాసరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ

- అభినందన కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్
- జిల్లాలో 66 మంది పోలీసులకు ప్రశంసా పత్రాలు

బాపట్ల టౌన్: జిల్లాలో ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఎన్నికలు సమర్థంగా నిర్వహించగలిగామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో సమర్థంగా విధులు నిర్వహించిన 66 మంది పోలీసులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా అవిశ్రాంతంగా పని చేశారన్నారు. పోలీస్ శాఖ మొత్తం సమష్టిగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్లే నామినేషన్ సమయంలో, ఎన్నికల వేళ, కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని పేర్కొన్నారు. పోలింగ్ రోజు కంట్రోల్ రూం నుంచి ఎన్నికల ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు. ముందస్తుగా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నప్పటికీ అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ పోలీసులు వేగంగా స్పందించి శాంతిభద్రతల్ని పరిరక్షించారని ప్రశంసించారు. పోలీస్ అధికారుల్ని అప్రమత్తం చేసి శాంతిభద్రతల్ని పరిరక్షించేందుకు 'సమర్ధ్ మొబైల్ యాప్' ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. దీనివల్ల ఎక్కడైనా ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి చేరుకునే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించగలిగామని వివరించారు. అవార్డులు అందుకున్నవారిలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాద్, బాపట్ల డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్‌తో పాటు 14 మంది సీఐలు, ఇద్దరు ఆర్ఐలు, తొమ్మిది మంది ఎస్ఐలు, 35 మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేసులు పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక

సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: పెండింగ్ కేసులు పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదికని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ నెల 29న జరగనున్న మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేకూర్చాలని తెలిపారు. లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కరించడంతో పాటు కక్షిదారులకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమనే విషయాన్ని కక్షిదారులకు వివరించి మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసు అధికారులు పని చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ పాల్గొన్నారు.

జంతువులను వధిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: జంతువుల్ని వధిస్తే జైలు కెళ్లడం ఖాయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బక్రీద్ పురస్కరించుకొని జిల్లాలోని ఈద్గాలు, మసీదుల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. 17న బక్రీద్ పండగ సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గో సంరక్షణ చట్టం 2017, జంతు సంరక్షణ చట్టం 1977 ప్రకారం గోవుల అక్రమ రవాణా నేరమని, వాటిని వధించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారిపై, సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే, ప్రజలు వెంటనే అప్రమత్తమై సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100,112లకు కాల్ చేసి సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు.

మంత్రి పర్యటనలో జేబుదొంగల చేతివాటం

అద్దంకి రూరల్: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తల్ని కలిసేందుకు అద్దంకి వచ్చారు. దీనిలో భాగంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసే కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రవికుమార్ రావడంతో ఒక్కసారి కార్యకర్తలు, నాయకులు తోపులాట జరిగింది. ఇదే అదునుగా భావించిన జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. అది గమనించిన కార్యకర్తలు ఓ దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సుమారు పది మంది వద్ద రూ.1 లక్ష వరకు పోయినట్లు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దుండగుడిని విచారిస్తున్నమని ఎస్ఐ నాగరాజు శనివారం తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంఅండ్ హెచ్‌వో ఎస్.విజయమ్మ



డయేరియా బాధితురాలిని పరామర్శిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ

వెల్లటూరు(భట్టిప్రోలు): మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎస్. విజయమ్మ సూచించారు. సాధారణ తనిఖీలో భాగంగా శనివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. రికార్డులతో పాటు వైద్యశాల ఆవరణ, పరిసరాల్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అక్కివారిపాలెంలో డయేరియా బాధితులకు పరామర్శ

పీహెచ్‌సీ పరిధిలోని పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో మూడు రోజుల కిందట డయేరియా కేసులు నమోదవ్వడంతో వైద్యురాలు చావలి రామలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని వైద్యురాలు రామలక్ష్మి డీఎం అండ్ హెచ్‌వో విజయమ్మకు తెలియజేయడంతో ఆమె గ్రామాన్ని సందర్శించారు. డయేరియా బాధితులతో పాటు గర్భిణులు, బాలింతల్ని పరామర్శించారు. ఆరోగ్య, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. గ్రామంలో 20 మందికి డయేరియా లక్షణాలు ఉన్నట్లు సిబ్బంది గుర్తించి చికిత్స అందించారని, అంతా యథాస్థితికి వచ్చారని తెలిపారు. శనివారం మరో రెండు కేసులు నమోదయ్యాయని, పరిస్థితి అదుపులోకి వచ్చేంత వరకు శిబిరాన్ని కొనసాగించనున్నట్లు ఆమె వెల్లడించారు. సీజనల్ వ్యాధుల్లో డయేరియా ఒకటని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆమె వెంట డిస్ట్రిక్ హెచ్ఈవో రవి, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఎంపీహెఈవో కె. నాగేశ్వరరావు, హెచ్ఎస్ శ్రీనివాసరావు, హెచ్‌వి రాజ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



చేబ్రోలు: రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని సంగం జాగర్లమూడి రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. రేపల్లె– గుంటూరు ప్యాసింజర్ రైలు ఉదయం సంగం జాగర్లమూడి స్టేషన్ వద్ద ఆగింది. బయలుదేరి వెళ్లే సమయంలో ఆకస్మాత్తుగా ఓ వృద్ధుడు కదిలే రైలు చక్రాల వద్ద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో తల, మొండెం వేరు పడ్డాయి. రైల్వే సిబ్బంది సమాచారంతో గుంటూరు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సమాచారాన్ని సేకరించారు. మృతుడు జేబులో చేబ్రోలు, యడ్లపాటి నగర్‌కు చెందిన నామ భాను ఆధార్ కార్డు ఉంది. దాని ప్రకారం రైల్వే పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

క్రీడలతో శారీరక సౌష్టవం, మానసికోల్లాసం

- బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు పాఠ్య,నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన

పిట్టలవానిపాలెం: క్రీడలు శారీరక సౌష్టవంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు.మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్ని శనివారం ప్రారంభించారు. తొలుత కళాశాల ఆవరణలోని సరస్వతీ దేవి, నన్నయ్య విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని తెలిపారు. కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణను అలవరుస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో 11 జిల్లాలకు చెందిన పురుషులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటు పని చేయకపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు భూపతిరాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాల ఉన్నతికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కర్లపాలెం జెడ్పీటీసీ సభ్యులు పిట్ల వేణుగోపాలరెడ్డి, కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, శివాజీరాజు, మంతెన కృష్ణంరాజు, టీడీపీ నాయకులు మంతెన కృష్ణమూర్తిరాజు, నరసరాజు, దోమ నాగేశ్వరరెడ్డి, మంతెన గంగరాజు, మెండు చంటి, దండు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

రూ.1.99 లక్షల విలువైన మిరప విత్తనాల అమ్మకాలు నిలిపివేత



దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ తిరుమలాదేవి, ఏఓ కిషోర్

కొరిటిపాడు(గుంటూరు): లైసెన్స్ డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని పురుగు మందుల పరీక్ష కేంద్రం సహాయ సంచాలకులు సీహెచ్. తిరుమలాదేవి సూచించారు. శనివారం ఆమె పట్నంబజారులోని పలు విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. స్టాకు రిజిష్టరులోని వివరాలతో పాటు, గిడ్డంగుల్లోని స్టాకును పరిశీలించారు. సోర్స్ సర్టిఫికెట్ చూపని కారణంగా విజయ శానిటరీ సీడ్స్ షాపులో సుఫల అగ్రిజెనిటిక్స్, నన్‌హెమ్స్ కంపెనీలకు సంబంధించిన రూ.1.99 లక్షల విలువ గల 300(10 గ్రాములు) ప్యాకెట్ల మిరప విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. షాపు యజమానికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ తిరుమలాదేవి మాట్లాడుతూ విత్తన డీలర్లు రిజిష్టర్లు, స్టాక్ బోర్డులు తప్పనిసరిగా దుకాణాల ఎదుట ప్రదర్శించాలని సూచించారు. రైతులను నష్టపరిచేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కొనుగోలుకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ ఏఓ బి.కిషోర్ పాల్గొన్నారు.

శిక్షణ అపురూపం

అందమే ఆనందం.. ఆనందమే జీవిత మకరందం అన్నారో సినీ కవి.. అందంగా కనిపించేందుకు అందరూ ఇష్టపడతారు.. మహిళల్లో ఈ ఆసక్తి కాస్తంత ఎక్కువ.. అందంగా కనిపించడం ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందనడంలో సందేహం లేదు. తమ అందానికి మెరుగులు దిద్దుకునేందుకు బ్యూటీపార్లర్ల బాట పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో.. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు సైతం రెట్టింపయ్యాయి. ఇందులో రాణించాలనుకునే యువతులు, మహిళలకు 'సాక్షి మైత్రి మహిళ' అండగా నిలుస్తూ.. ఉపాధికి మార్గం చూపుతూ.. వారి భవితకు బంగారు బాటలు వేస్తోంది.

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

- వందలాది మంది యువతులు, మహిళల ఉపాధికి ఊతం
- శిక్షణ ముగిసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేత
- ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నామంటున్న మహిళలు
- ఇతరులకూ ఉపాధి చూపుతామంటూ ధీమా



సాక్షి మైత్రి మహిళ బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శిక్షకురాలు నల్లూరి సుజాత

నగరంపాలెం: నేటిరోజుల్లో తమ అందానికి మరింత మెరుగులు దిద్దించుకునేందుకు మహిళలు బ్యూటీపార్లర్ల వైపు చూస్తున్నారు. దీంతో అనేక మంది నిరుద్యోగ యువతులు, మహిళలకు బ్యూటీషియన్ రంగం ఉపాధి చూపుతోంది. ఈ క్రమంలో 'సాక్షి మైత్రి మహిళ' ఎన్నో ఏళ్లుగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ అందిస్తోంది. వారి జీవనానికి ఎటువంటి ఢోకా ఉండదనే ఒక భరోసాను కల్పించింది. ఈ క్రమంలో మరోసారి సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీషియన్ శిక్షణకు గుంటూరు నగరంతోపాటు, ఉమ్మడి జిల్లా నుంచి మహిళలు పోటీపడ్డారు. గతనెల 20 నుంచి ఈనెల 15వ తేదీ వరకు గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని షి అండ్ షైన్ హెర్బల్ బ్యూటీక్లినిక్‌లో సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో మహిళలకు తర్ఫీదిచ్చారు. నెల రోజులపాటు నిర్విరామంగా జరిగిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. దీంతో శిక్షణ పూర్తయిన వారికి ధ్రువీకరణ పత్రాలను శిక్షకురాలు నల్లూరి సుజాత అందించారు. తమ జీవనోపాధికి ఒక భరోసాను కల్పించారని, తమ జీవితాలు బ్యూటిఫుల్‌గా ఉంటాయని శిక్షణ పొందిన వారు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధ చూపారు



ప్రస్తుతం నేను బ్యూటీషియన్‌గా చేస్తున్నా. గత నెలలో సాక్షి దినపత్రికలో వెలువడిన ప్రకటనతో దరఖాస్తు చేశాను. కోర్సులో మరెన్నో అంశాలను నేర్చుకోవచ్చునని భావించా. అలాగే తెలియని అనేక కొత్త విషయాలను ఇక్కడ కూలంకుషంగా నేర్పించారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. శిక్షణ అనంతరం ఉపాధి పొందవచ్చనే ఒక భరోసా, ధైర్యం ఏర్పడింది. దీనికితోడు ఉపాధి అవకాశాలు (ప్లేస్‌మెంట్స్) చూపించడం చాలా బాగుంది.

– అమృత, వెంగళరావునగర్, గుంటూరు

ఇతరులకూ 'ఉపాధి'



సాక్షి దిన పత్రికలో ప్రకటన చూసి, ఇందులో చేరాను. నెల రోజులపాటు పలు అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. అంతేగాక ప్రాక్టికల్‌గా చేయించారు. అందులో మెలకువలు నేర్పించారు, బ్యూటీ పార్లర్లకు వచ్చే యువతులు, మహిళలతో ఎలా మాట్లాడాలనే అంశాలపై కూడా శిక్షణ ఇచ్చారు. ఇక్కడ నేర్చుకున్న శిక్షణతో త్వరలో ఒక బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుని, ఇతరులకు సైతం ఉపాధి చూపుతాను.

– ఎస్.నాగరాణి, నరసరావుపేట

సాక్షి మహిళ మైత్రికి ధన్యవాదాలు



శిక్షణలో త్రెడ్డింగ్, హెయిర్‌కేర్, బ్రైడల్ మేకప్స్, పెడిక్యూర్, డ్యాండ్రఫ్ తదితర అంశాలపై తర్ఫీదిచ్చారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం రానున్న రోజుల్లో జీవనోపాధికి చక్కగా ఉపయోగపడనుంది. నేటి దినాల్లో యువతులు, మహిళలు అందంగా ఉండేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఏదైనా శుభ కార్యం జరిగితే చక్కగా అలంకరించుకుని వెళ్లేందుకు ప్రాధాన్యత చూపుతున్నారు. దీంతో మా ఉపాధికి ఎటువంటి ఢోకా ఉండదు. సాక్షి మహిళ మైత్రికి ధన్యవాదాలు.

– కె.ప్రసన్న, నెహ్రూనగర్, గుంటూరు

ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్నాం



సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు దాదాపు 250 మంది యువతులు, మహిళలకు తర్ఫీదిచ్చాం. ఇక్కడ శిక్షణ పొందిన అనేక మంది ప్రస్తుతం సొంతంగా బ్యూటీపార్లర్‌లను నిర్వహిస్తున్నారు. వారి జీవనోపాధికి ఎటువంటి ఇబ్బందిలేదు. పైగా ఇతరులకు సైతం ఉపాధి చూపుతున్నారు. భవిష్యత్‌లో మరింతమందిని బ్యూటీషియన్‌లుగా తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతున్నాం. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా ప్రధానమైన అంశాలు నేర్పిస్తాం. అంతేగాక ప్రాక్టికల్‌గా చేయిస్తున్నాం. ఈ శిక్షణ వారికి ఎంతగానో ఉపయోపడుతుంది. ఉపాధికి మార్గంగా ఉంటుంది.

– నల్లూరి సుజాత, షి అండ్ షైన్ హెర్బల్ బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు/శిక్షకురాలు

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

తెనాలి రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం. రమేష్ వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు పఠాన్ నస్కర్ ఐదేళ్ల కిందట తెనాలి వచ్చి మగ్గం పని చేస్తున్నాడు. తనకు పరిచయమున్న పశ్చిమ బెంగాల్‌కే చెందిన మహమ్మద్ షఫీ సర్దార్(ఏడాదిగా తెనాలిలో ఉంటున్నాడు. ఇటీవల గంజాయి కేసులో త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు) వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్న పొట్లాలుగా కట్టి విక్రయిస్తున్నాడు. నస్కర్ వద్ద ప్యాడిసన్‌పేటకు చెందిన పురుషోత్తం నాని గంజాయి కొనుగోలు చేస్తుండేవాడు. ఈక్రమంలో నస్కర్, నానీలు తెనాలి ఆర్టీసీ బస్టాండ్ మెయిన్ గేటు వద్ద ఉన్నారని వచ్చిన సమాచారంతో టూ టౌన్ సీఐ ఎం.సుధాకర్, సిబ్బంది ఆకస్మిక దాడి చేసి అదుపులోకి తీసుకోగా వారి వద్ద 1500 గ్రాముల గంజాయి లభించింది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

వ్యసనాలకు బానిసై చోరీల బాట

- దొడ్లేరులో రూ.10.38 లక్షలు అపహరణ
- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గురునాథ్‌బాబు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గురునాథ్‌బాబు, పక్కన సీఐ మంగారావు

సత్తెనపల్లి: మద్యం, పేకాట, చెడు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక దొంగతనాలు ఎంచుకున్నాడు. చివరకు పోలీసుల చేతికి చిక్కి కటకటాల పాలయ్యాడు. కార్యాలయంలో శనివారం సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు చోరీల బాట పట్టిన యువకుడి అరెస్ట్ వివరాలను వెల్లడించారు. క్రోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన జవ్వాది సురేష్ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యం, పేకాట, చెడు వ్యసనాలకు బానిసై కుటుంబ ఖర్చులకు సంపాదన సరిపోక చుట్టుపక్కల గ్రామాలలో అప్పులు చేశాడు. చెడు వ్యసనాలకు, కుటుంబ ఖర్చులకు చేసిన అప్పులు తీర్చడానికి డబ్బు కోసం తిరుగుతూ ఈ నెల 13న అర్ధరాత్రి 2.00 గంటల సమయంలో క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో పోసిపోగు ఆంధ్రబాబు ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. 155.950 గ్రాముల బంగారు వస్తువులు, 132 గ్రాముల వెండి వస్తువులు, రూ.3,500 నగదు, సెల్‌ఫోను మొత్తం కలిపి సుమారు రూ. 10,38,500 ఉన్న ట్రంకు పెట్టెను అపహరించుకుపోయాడు. దీనిపై జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు ఈ కేసును ఛేదించేందుకు సత్తెనపల్లి డీఎస్పీ పర్యవేక్షణలో పెదకూరపాడు సర్కిల్ సీఐ జి.మంగారావు, క్రోసూర్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, మరో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక పోలీస్ కానిస్టేబుల్, ఒక హోంగార్డును బృందంగా ఏర్పాటు చేసి చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం అనంతవరం గ్రామంలో మెయిన్ సెంటర్ వద్ద జవ్వాది సురేష్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 155.950 గ్రాముల 15 రకాల బంగారు ఆభరణాలు, 132 గ్రాముల 8 రకాల వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.3,500 నగదు స్వాధీన పరుచుకున్నారు. జవ్వాది సురేష్ క్రైమ్ నెంబర్ 158/2015లో క్రోసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పత్తి దొంగతనం కేసులో అరెస్ట్ అయ్యి జైలు పాలయ్యాడు. ఈ కేసు ఛేదించేందుకు పెదకూరపాడు సర్కిల్ సీఐ జి.మంగారావు, క్రోసూర్ ఎస్ఐ షేక్ మొహమ్మద్ షఫీ, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.దాసు, బి.సత్యంరాజు, ఎం.రామకోటేశ్వరరావు, కానిస్టేబుల్ బి.రమేష్ బాబు, హోంగార్డు షేక్ జానీలు సహకరించారు.

పరిశోధన విద్యార్థులకు ఉజ్వల భవిత

ఐఐటీ హైదరాబాద్, ప్రొఫెసర్ సి.శాస్త్రి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సి.శాస్త్రి

చేబ్రోలు: గణిత రంగంలో పరిశోధనలు చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సి.శాస్త్రి తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథమ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ అనే అంశంపై మూడు రోజుల పాటు హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శనివారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటీ, హైదరాబాద్ ప్రొఫెసర్ సి.శాస్త్రి మాట్లాడుతూ విభిన్న వర్గాల వినియోగదారులు, వారి అభిరుచులు, అవసరాలను గుర్తించే క్రమంలో సమాచారాన్ని సేకరించడం.. వాటిని క్రోడీకరించి వర్గీకరిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్ రంగాలలో పరిశోధనలు పెరిగినట్లయితే మానవాళికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. హైదరాబాద్‌లోని నోవార్టిస్ కంపెనీ డేటా అనలిస్ట్ డాక్టర్ ఎం.వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు వారి బ్రాంచిలకు సంబంధించిన సబ్జెక్టులపైనే కాకుండా ప్రాథమిక సైన్స్, మేథమేటిక్స్ విషయాలపై అవగాహనతో ఉంటే ఎంతో మంచిదని తెలిపారు. మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ వంటి స్పెషలైజేషన్లు చదివి స్టాటిస్టికల్ అనాలిసిస్ సిస్టమ్, హడూప్ వంటి సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లలో శిక్షణ పొందితే డేటా సైంటిస్ట్ నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికా విద్యతో సమాజ ప్రగతి



ఐలవరం(భట్టిప్రోలు): బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు, విద్యార్థులను పాఠశాలల్లో చేర్చే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం భట్టిప్రోలు మండలం జెడ్పీ హైస్కూల్‌లో బాలికా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నీలం దేవరాజు బాలికా విద్య వల్ల చేకూరే ప్రయోజనాలు, పలువురు ప్రతిభా స్త్రీ మూర్తుల గాథలు, వారి విజయానికి విద్య ఎలా దోహదం చేసిందనే విషయాలను తెలియజేశారు. హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి, ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ పేద విద్యార్థికి దాతలు ఊడ సాయికుమార్, తేజ విష్ణు శనివారం సహాయమందించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని నులకపేటకు చెందిన బోలెం దుర్గాప్రసాద్ తల్లిదండ్రులను కోల్పోగా, మామయ్య వద్ద ఉంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నాడు. ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని రామ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పలగాని శ్రీనివాసరావు దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. విద్యార్థి పరిస్థితిని తమ తండ్రి ఊడ శివన్నారాయణకు వివరించడంతో రూ.20 వేల ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి బోలెం దుర్గాప్రసాద్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

పోలీసులు విధిగా హెల్మెట్ ధరించాలి



తెనాలిరూరల్: పోలీసు సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని డీఎస్పీ రమేష్ సూచించారు. టూ టౌన్ సర్కిల్ పరిధిలో 'బైక్‌ర్యాలీ విత్ హెల్మెట్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైక్‌లను నడుపుతున్న వారికి పోలీసులు జరిమానా విధించాలంటే పోలీసులు సైతం హెల్మెట్ ధరించాలన్నారు. టూ టౌన్ స్టేషన్ సిబ్బంది 40 మందికి హెల్మెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఎస్ఐ కరిముల్లా, రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థంగా 'నేను బడికి పోతా'



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు సమర్థంగా నిర్వహించాలని ఎంఈఓ కేఏఫ్ కెనడీ ఆదేశించారు. మండలంలోని కాకుమాను, కొండపాటూరు తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని బడి బయట పిల్లలు లేని గ్రామంగా చేసే విధంగా ప్రతి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు. బడి బయట పిల్లలను గుర్తించి వారి వయస్సు తగిన తరగతిలో చేర్పించాలని ఆయన సూచించారు.

పంట కాల్వల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలి

పొన్నూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు పంట కాలువల్లో పూడిక తీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పొన్నూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందేలా ఇరిగేషన్ శాఖాధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు ఉపయుక్తంగా ఉండేలా కాల్వలను బాగు చేయాల్సిన అవసరం ఉందని, గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన పంట కాల్వల్లో పూడిక తీతపై ఇరిగేషన్ అధికారులు దృష్టిసారించాలని పేర్కొన్నారు. వరి విత్తనాల సరఫరా నిరాటంకంగా జరిగేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోలని తెలిపారు.

కలుషిత నీటి సరఫరాతో ఇక్కట్లు

రోగాల పాలవుతున్న పట్టణ వాసులు



పురపాలక సంఘం సరఫరా చేస్తున్న కలుషిత నీరు

బాపట్ల: బాపట్ల పట్టణంలోని నీటి సరఫరా కలుషితం కావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీరు సరఫరా చేసే పైపులైన్లు లీకులు కావటంతో నీరు కలుషితం అవుతోంది. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన మంచి నీటి పైపులైనుగా ఉన్న జీబీసీ రోడ్డులో పైపులైన్లు లీకు కావటంతో ఈ సమస్య వచ్చింది. గత వారం రోజులుగా కలుషిత నీరు వస్తోంది. ఈ నీరు త్రాగటం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కలుషిత నీటి సరఫరాపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

వెల్లటూరు(భట్టిప్రోలు): మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున జన్మదినోత్సవం పురస్కరించుకుని ఆయన స్వగ్రామమైన భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ) విద్యార్థులకు ఆయన సోదరుడి కుమారులు, అభిమానులు శనివారం నోటు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు అందజేశారు. పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 50 మంది విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో మేరుగ కోటేశ్వరరావు, మేరుగ చలంబాబు, జడా జయసూర్య, ముక్తేశ్వరరావు, హెచ్ఎం రోజా రమణి, ఉపాధ్యాయురాలు పద్మజా రాణి పాల్గొన్నారు.

అంకెలు కాదు ఆపద్బాంధవులు

- ఆపత్కాలంలో ఆదుకునే 100, 112, 182, 1098
- యువతులు, చిన్నారులు, మహిళలకు వరం
- వీటికి తోడు మహిళల సంరక్షణకు దిశ కాల్స్



దిశ యాప్

తాడేపల్లిరూరల్: ఆపద వేళ ఆపద్బాంధువులను పిలిచేందుకు ఈ నంబర్లను గుర్తుంచుకోవడం అవసరం. తల్లిదండ్రులు, జీవిత సహచరుల నంబర్లతో పాటు ఈ నంబర్లను కూడా విధిగా గుర్తుపెట్టుకుని అవసరం అనుకున్న వేళ వాడుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటున్నారు. కాల్ రావడమే ఆలస్యం ఘటన స్థలానికి చేరుకుంటున్నారు. అవసరం అనుకుంటే అరెస్టులు కూడా చేస్తున్నారు. మనం చేయాల్సిందల్లా ఒకే ఒక్క పని... అత్యవసర వేళ సంకోచించకుండా ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేయడం. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలను అడ్డుకోవడానికి చిన్నారులపై, యువతులపై లైంగిక దాడులు జరిపే నేరగాళ్ల పని పట్టడానికి ఈ ఎమర్జెన్సీ కాల్స్ ఎంతో ఉపయోగం. 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు కొన్ని ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లు ప్రవేశ పెట్టాయి.

డయల్ 100 ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్న నంబరు 100. ఈ నెంబరుకు డయల్ చేస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితులు తమ పరిస్థితి వివరించాక అక్కడి నుంచి సంబంధిత పీఎస్‌కు లైన్ కలిపి అలెర్ట్ చేస్తారు. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా సమీపంలో ఉన్న పోలీసులు, గస్తీ వాహనాలను అప్రమత్తం చేయడమే కాక బాధితురాలు ధైర్యంగా ఉండేలా పలు సూచనలు చేస్తారు. పది నిమిషాల్లో అక్కడకు చేరుకుంటారు.

1091 మహిళలను అత్తింటివారు, భర్త హింసించడం, కొట్టడం వంటివి చేస్తే 1091కు కాల్ చేస్తే నేరుగా మహిళా సెల్‌కు కనెక్ట్ అవుతుంది. అంతేకాక మహిళలపై దాడికి పాల్పడినప్పుడు ఎవరైనా బయట వ్యక్తి చూసినా ఈ నంబరుకు కాల్ చేయవచ్చు. పిల్లలను హింసించినా సాయం కోరవచ్చు.

112 గతంలో మహిళల సమస్యలపై నేరుగా 100కు డయల్ చేస్తే పోలీసు యంత్రాంగం వెంటనే అప్రమత్తమయ్యేది. ఇప్పుడా నంబరుకు అన్ని రకాల ఫిర్యాదులు ఎక్కువ కావడంతో మహిళల సౌలభ్యం కోసం ప్రత్యేకించి 112 నెంబరును కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టింది. బాధితులు దేశంలో ఎక్కడి నుంచైనా ఈ నెంబరుకు కాల్ చేస్తే చాలు. వారికి సంబంధించిన రాష్ట్రంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. దీనికంటూ 112 మొబైల్ యాప్ కూడా ఉంది.

182 ఈ నంబరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌నకు చేరుతుంది. ఎవరైనా రైళ్లలో ప్రయాణించేటప్పుడు లైంగిక వేధింపులకు గురైనా, దొంగతనాలు, ఆపదలో ఉండే సందర్భాల్లో ఈ నెంబరుకు కాల్ చేయవచ్చు. బాధితులు ప్రయాణిస్తున్న సంబంధిత రైలులో ఉండే ఆర్‌పీఎఫ్ పోలీసులకు కంట్రోల్ రూమ్ నుంచి మెసేజ్ వెళ్తుంది. వెంటనే బాధితులున్న బోగీల్లో పోలీసులు అప్రమత్తమై సమస్యను పరిష్కరిస్తారు.

91212 11100 మహిళలు ముఖ్యంగా యువతులపై జరిగే సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట వాట్సప్ నంబరు 91212 11100ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. ఆపదలో ఉండి అత్యవసర పరిస్థితుల్లో ఈ నెంబరుకు మెస్సేజ్ పంపిస్తే పోలీసులు వాలిపోతారు. ఈ నంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

దిశ యాప్ ఉండనే ఉంది...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగింది. యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే చాలు ఆపదలో ఉన్న సంకేతాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు చేరి వెంటనే పోలీసులు అలెర్ట్ అయ్యి సమస్యను పరిష్కరిస్తారు.

మహిళల భద్రతకు....

మహిళల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మహిళలను వేధించే వారిపై ప్రస్తుత చట్టాలు కఠినంగా ఉన్నాయి. ప్రజలు ఎమర్జెన్సీ నంబర్లను వినియోగించుకోవాలి.

వినూత్న ఆవిష్కరణల దిశగా శిక్షణనివ్వాలి

ఎస్కేయూ ఇంక్యూబేషన్ మేనేజర్ డాక్టర్ సి.చంద్రమౌళి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థి ఆలోచనలను నూతన ఆవిష్కరణలు, అంకుర పరిశ్రమల వైపు ప్రోత్సహిస్తూ అధ్యాపక బృందం తగిన రీతిలో శిక్షణ అందించాలని, దీంతో వారు అద్భుతాలు సృష్టిస్తారని అనంతపూర్ శ్రీకృష్ణ దేవరాయ యూనివర్శిటీ ఇంక్యూబేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పి.చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో 'థింక్ బియాండ్ ఫ్యాకల్టీ వర్క్ షాప్ ఆన్ వాలిడేటింగ్ ఐడియాస్' వర్క్‌షాప్‌ను అధ్యాపకులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను ప్రారంభ దశలోనే గుర్తించి, వారి ఆలోచన విధానాలను పరిశోధనలు, ఆవిష్కరణలు, అంకుర పరిశ్రమల వైపు దృష్టి సారించే విధంగా అధ్యాపకులు కృషిచేయాలన్నారు. వివిధ పరిశ్రమల్లో ఏర్పడే సాంకేతికత సమస్యలను సత్వర పరిష్కారం చూపే విధంగా విద్యార్థి దశలోనే తయారవ్వాలని సూచించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాలు ఆశించే స్థాయి నుంచి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నిపుణులు విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని మరింత వృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐటీబీఐ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, సీఈఓ డాక్టర్ మహేంద్ర వర్మ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామికి తులసిదళార్చన



లక్ష్మీ సుదర్శన హోమం నిర్వహిస్తున్న భక్తులు



తులసి మాలలో దర్శనమిచ్చిన స్వామి వారు

నగరంపాలెం: కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. శనివారం వేణుగోపాల స్వామి వారికి తులసిమాలలో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం సహాయ కమిషనర్ (ఈఓ), డి.శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గావర ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు అయోధ్య అయ్యప్ప పర్యవేక్షణలో నిర్వహించారు.

వైద్యరంగంలో పరిశోధనలు విస్తృతమవ్వాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: వైద్య రంగంలో మరింత పరిశోధనలు జరగాల్సి ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం గుంటూరు వైద్య కళాశాలలో ఫార్మకాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో గుడ్‌క్లినికల్ ప్రాక్టీస్‌పై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యరంగంలో పరిశోధనలు ఎక్కువగా జరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రస్తుతం మనదేశంలో చాలా పరిశోధనలు ప్రాథమిక దశలోనే ఉన్నట్లు వెల్లడించారు. ప్రపంచ దేశాలు పరిశోధనలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, మనదేశంలో కూడా పరిశోధనల వైపు దృష్టి పెడుతున్నట్లు వెల్లడించారు. ఆధునిక పరికరాలు, మందులకు పరిశోధన అంది పుచ్చుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పరిశోధనలు చేయడం వల్లే రోగులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని, ల్యాప్రోస్కోపి, ఎండోస్కోపి ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. పరిశోధనలు జరగకపోతే మానవ మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. పెథాలజీ వైద్య విభాగంలో పెను మార్పులకు పరిశోధనలే కారణమని గుర్తు చేశారు. రక్తం తీసుకుని క్యాన్సర్ సంబంధిత పరీక్షలను గుర్తించే ప్రక్రియ జరుగుతోందన్నారు. పీజీ వైద్యులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర రావు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శంకర్, డాక్టర్ సోమ శేఖర్ పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో స్టూడెంట్ కిట్స్ అందజేత




చేబ్రోలు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు భవిత కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సుబ్బారావు అన్నారు. చేబ్రోలు కొత్తపేట ఎంపీపీ పాఠశాల వద్ద భవిత కేంద్రంలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం జరిగింది. వేసవి సెలవుల అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు పాఠశాల పునః ప్రారంభమైంది. భవిత కేంద్రంలో అందించే ఫిజియోథెరిపి ఇతర సేవల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జి.అనూరాధ, జి.రాజేష్, ఫిజియోథెరిపిస్ట్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాల కోసం ఈ నెల 19, 20 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చినవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మెరిట్ నెంబర్ 1 నుంచి 304 వరకు మొదటి రోజు, 305 నుంచి 537 వరకు రెండో రోజు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 8686689234, 9347795839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

షారోన్ హైస్కూలు డైరెక్టర్ ఆకస్మిక మృతి



తెనాలి: పట్టణానికి చెందిన షారోన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ కె.శ్యామ్‌బెనర్జీ (53) శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో స్థానిక చినరావూరులోని స్వగృహంలో హఠాన్మరణం చెందారు. ఆయన భార్య మేరీ బెనర్జీ హైస్కూలు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో ఏఎస్ఓగా పని చేస్తున్నారు. విద్యాభ్యాసం తర్వాత సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేసిన శ్యామ్‌బెనర్జీ, 2000 సంవత్సరంలో దేవీచౌక్ వద్ద గల విమానం మేడలో షారోన్ టాలెంట్ స్కూల్‌ను ప్రారంభించారు. కొంతకాలం తర్వాత బోసు రోడ్డులోకి తరలించి షారోన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలుగా పేరు మార్చారు. ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తూ వచ్చారు. కొంతకాలం ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ కూడా ఇచ్చారు. ఆయన శిక్షణలో పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారు. శ్యామ్ బెనర్జీ మృతికి పలు పాఠశాలల నిర్వాహకులు సంతాపం తెలియజేశారు.

చెత్తబుట్టలో సంక్షేమ బావుటా పుస్తకాలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు సచివాలయం ఆవరణలో సంక్షేమ బావుటా పుస్తకాలు శనివారం చెత్తలో దర్శన మిచ్చాయి. ప్రజా స్వామ్యంలో గెలుపు ఓటములు సర్వ సాధారణమని, ఇలాంటి సంఘటనలకు పాల్పడటం తగదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సచివాలయ సిబ్బంది ప్రమేయం లేకుండా ఈ సంక్షేమ బావుటా పుస్తకాలు బయటకు ఎలా వచ్చాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎ. రామ్ కుమార్‌ను వివరణ కోరగా పుస్తకాలు విషయం తన దృష్టికి రాలేదని విచారించి సంఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



బీరువా బహూకరిస్తున్న ఉపాధ్యాయిని సరోజ

బాపట్ల: బాపట్ల మండలం గోపాపురం పాఠశాలకు ఎంఈవో ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయులు బీరువాను శనివారం బహూకరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు తడపర్తి రాధాకృష్ణమూర్తి, పుష్పావతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట రంగం, కోడలు ఏ.సరోజ బీరువాను పాఠశాలకు అందించారు. తొలుత ఎంఈవో నిరంజన్ పాఠశాలను సందర్శించి మేము బడికి పోతామనే కార్యక్రమంలో భాగంగా ఆరుగురు విద్యార్థులను బడిలో చేర్పించారు. పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయిని సరోజ అందించిన బీరువా, రాత సామాగ్రిని పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బడుగు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బేగ్, మాణిక్యరావు, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

తెనాలిరూరల్: ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అవకాశమున్న కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు న్యాయవాదులకు సూచించారు. న్యాయవాదులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. మోటారు వాహన చట్టంలో సుప్రీం కోర్టు చేసిన సవరణల గురించి వివరించారు. సివిల్ అప్పీల్ 9322/2022 కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు రోడ్డు ప్రమాద బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం త్వరితగతిన అందేలా కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడుతోందని తెలిపారు. రాజీ అవకాశమున్న సివిల్, క్రిమినల్, ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలోఅదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఏ. పవన్ కుమార్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి వివేక్ వర్ధన్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

మంత్రి మనోహర్‌ను కోరిన మద్యం దుకాణాల సిబ్బంది



మంత్రి మనోహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిబ్బంది

తెనాలిరూరల్: గత ఐదేళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో మద్యం దుకాణాల్లో సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ సేల్స్‌మెన్ అండ్ సూపర్‌వైజర్ల అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల అంశాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. స్థానిక బోస్‌రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,600 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 12 వేలకు పైగా సిబ్బంది పని చేస్తున్నామని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు కొన్ని మాధ్యమాల్లో వార్తలు వస్తున్నట్టు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు ధనరాజుపల్లి సురేష్, ఉపాధ్యక్షుడు పినపాటి కొండల రాజు, కార్యదర్శి కొచ్చర్ల శివప్రసాద్, కోశాధికారి షేక్ నాగూర్ తదితరులు ఉన్నారు.

వీనులవిందుగా సప్తగిరి సంకీర్తనల గోష్టి గానం



కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో పద కవితా పితామహ శ్రీతాళ్లపాక అన్నమాచార్య 616 వ జయంతి మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సి.జ్యోతి జ్యోతిప్రజ్వలన చేశారు. సంస్థ అధ్యక్షురాలు న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం సప్తగిరి సంకీర్తనల గోష్టి గానం వీనుల విందుగా జరగ్గా, కళాకారులు గోష్టి గానంలో పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీత కచేరీలో వాగ్గేయకార కీర్తనలను పసుమర్తి పావని (విజయవాడ) శ్రావ్యంగా గానం చేసి, సంగీతాభిమానులను అలరించారు. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ , మృదంగంపై ఎ.ఎస్.ఆర్.కౌండిన్య చక్కటి వాయిద్యాన్ని అందించారు. ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలిత దేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మీ, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు. మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీధర్, ఆత్మీయ అతిథిగా సంస్కృతాచార్యులు గుదిమెళ్ళ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న పలువురు అరెస్టు

గుంటూరు ఈస్ట్: వ్యభిచార ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లారెడ్డినగర్‌లోని ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శనివారం దాడి చేశారు. ఇంట్లోని ఐదుగురు మహిళలు, ముగ్గురు విటులు, ఇరువురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మహిళలను రెస్క్యూ హోంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు ఒంటెలు స్వాధీనం

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా గోవధకు పాల్పడేందుకు తీసుకొచ్చిన ఐదు ఒంటెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలో ఐదు ఒంటెలు ఉండటం గుర్తించారు. గో సంరక్షణ సమితి సభ్యుల ఇచ్చిన సమాచారం మేరకు ఆ ఒంటెలను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.